సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 23 । జూలై । 2023



తిరునక్షత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదాదేవి తిరునక్షత్రోత్సవాల సందర్భంగా విశేష పూజలు జరిగాయి.



శ్రీవారి సేవలో..

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయాన్ని దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్య నారాయణ శనివారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి భక్తుల రాక మొదలైంది. క్షేత్రంలోని అన్ని విభాగాలూ కిటకిటలాడాయి.

న్యూస్‌రీల్

దేశ సమైక్యతకు జాతీయ జెండా ప్రతీక



గాంధీజీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్వాతంత్ర్య సంగ్రామానికి జాతీయ జెండా స్ఫూర్తిగా నిలిచిందని, దేశ ఔన్నత్యాన్ని చాటిందని, జాతీయ జెండాను రాజ్యాంగపరంగా ఆమోదించిన రోజును ప్రజలంతా పండుగలా జరుపుకోవాలని భీమవరం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో శనివారం భారీ జాతీయజెండా, పింగళి వెంకయ్య, మహాత్మాగాంధీ చిత్రపటాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు జాతీయ జెండా ప్రతీకగా నిలుస్తోందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటరమణ మాట్లాడుతూ ఇటువంటి స్ఫూర్తిదాయక కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, లూథరన్ హైస్కూల్ హెచ్‌ఎం మణిరాజు, బార్ అసోసియేషన్ సభ్యులు ఉండపల్లి రమేష్‌నాయుడు, శ్యామూల్‌రాజు, కమల్ రాజు, కె.ఇందిర, కె.శిరీష, ఎండీ సరోజినీ, మైలబత్తుల ఐజాక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సమయం ఆదా

ఏలూరు (టూటౌన్): లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులు తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని పోక్సో ప్రత్యేక కోర్టు స్పెషల్ జడ్జి ఎస్.ఉమాసునంద తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో జడ్జి ఉమాసునంద మాట్లాడారు. ప్రత్యేక లోక్ అదాలత్‌లో వాహన ప్రమాద, భూ పరిహార క్లయిమ్‌లు పరిష్కరిస్తారన్నారు. ఏడో అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఏ.మేరీ గ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కేకేవీ బుల్లి కృష్ణ, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, జీపీ బి.జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 130 వాహన ప్రమాద కేసులను రాజీ చేసి రూ.8.03 కోట్లు పరిహారంగా చెల్లించారు.

నాలుగు కాళ్ల కొంగ పిల్ల



భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రులో శనివారం నాలుగు కాళ్ల కొంగ పిల్ల కనిపించింది. దీనిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. మండల పశు సంవర్ధక అధికారి పి.పుండరీబాబును నాలుగు కాళ్ల కొంగ పిల్లపై వివరాలు అడగ్గా తల్లి కొంగ రెండు అండాలున్న గుడ్డును పొదిగితే జన్యు మార్పిడి చెంది ఇటువంటి పక్షులు జన్మిస్తాయని చెప్పారు.

ఎడతెగని వాన

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఎడతెగని వాన కురుస్తోంది. గత 24 గంటల్లో పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 4 మి.మీ సగటు వర్షపాతం నమోదు కాగా పాలకోడేరు మండలంలో 9.2 మి.మీ, పాలకొల్లు మండలంలో 8.4 మి.మీ, గణపవరం మండలంలో 7.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ప్రతి మండలంలో చెదురుమదురు వర్షం కురుస్తూనే ఉంది.

నిలకడగా గోదావరి

- తగ్గుముఖం పట్టిన వరద
- పోలవరం ప్రాజెక్టు నుంచి 6.33 లక్షల క్యూసెక్కులు విడుదల
- ముంపు మండలాల్లో కొనసాగుతున్న సహాయక చర్యలు
- సురక్షిత ప్రాంతాలకు 27 మంది గర్భిణుల తరలింపు



యలమంచిలి: పడవపై రాకపోకలు సాగిస్తున్న లంక గ్రామాల ప్రజలు

సాక్షి ప్రతినిధి,ఏలూరు: గోదావరి వరద ఉధృతి కాస్త నెమ్మదించింది. శనివారం ఉదయం నుంచి వరద తీవ్రత కొంత తక్కువగానే ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి నీటి విడుదల తగ్గడంతో పోలవరం ప్రాజెక్టు వద్ద ఉధృతి కాస్త తగ్గింది. శుక్రవారం 7.75 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయగా శనివారం 6.33 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. మరోవైపు వరద ముంపు ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

స్వల్పంగా తగ్గి..

గోదావరి వరద ఉధృతి స్వల్పంగా తగ్గింది. భద్రాచలం వద్ద ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు 39.40 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. దీంతో 7.76 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న పోలవరం ప్రాజెక్టుకు విడుదల చేశారు. రాత్రి 7 గంటల సమయంలో భద్రాచలం వద్ద 40.80 అడుగులు నీటిమట్టం పెరిగింది. మరో రెండు రోజుల పాటు వరద ఉధృతి ఇదే తరహాలో కొనసాగుతుందని అధికారులు అంచనా వేశారు. ఏలూరు జిల్లాలోని ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులో 21 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక్కడ మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వందల మందిని తరలించారు. అలాగే 27 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలతో పాటు ముంపు గ్రామాల్లోని యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి. రెండు మండలాల్లో సెల్‌ఫోన్ టవర్లకు ఇబ్బంది లేకుండా జనరేటర్లను ఏర్పాటుచేశారు. అలాగే 40 మంది ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం వేలేరుపాడు క్యాంపులో ఉన్నారు. వేలేరుపాడు మండలం బొళ్లపల్లిలో మేత కోసం వెళ్లిన ఎద్దు ప్రమాదవశాత్తు బావిలో పడగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం కాపాడింది. మరోవైపు రెండు మండలాల్లో 48 ప్రాంతాల్లో వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయి. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, పాముకాటుతో సహా ఇతర వ్యాధులకు సంబంధించి 21 రోజులకు సరిపడా మందులను పంపిణీ చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి మండలంలో కలెక్టర్ పి.ప్రశాంతి పర్యటించారు. కనకాయలంకకి పడవపై వెళ్లి వరద పరిస్థితిని సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్‌లో ఇప్పటికే టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ఆచంట, యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లోని లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

ముంపులోనే కనకాయలంక కాజ్‌వే



యలమంచిలి: కనకాయలంక కాజ్‌వేపై వరద

యలమంచిలి: మండలంలో గోదావరి వరద నిలకడగా ఉండగా.. కనకాయలంక కాజ్‌వేపై నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. మూడు ఇంజిన్ పడవలు ఏర్పాటుచేశారు. వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయి. పాముకాటు, యాంటీ రేబిస్ మందులు సిద్ధం చేశారు. మండల ప్రత్యేక అధికారి బి.రమణ, తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్, ఎఫ్‌డీఓ ఏడుకొండలు, వీఆర్వో సరెళ్ల లక్ష్మి సహాయక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వరదను ఎదుర్కోవడానికి సిద్ధం: కలెక్టర్




కనకాయలంకకు పడవపై వెళ్తున్న కలెక్టర్

యలమంచిలి: గోదావరి వరదలను ఎదుర్కోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వరద ముంపునకు గురైన కనకాయలంక గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. గోదావరిలో వరద తగ్గుముఖం పట్టిందని, జిల్లాలోని పరీవాహక గ్రామాలకు పెద్దగా ప్రమాదం ఉండదని చెప్పారు. మళ్లీ గోదావరిలో వరద పెరిగినా సహాయక చర్యలకు యంత్రాంగాన్ని సిద్ధం చేశామన్నారు. ప్రజారవాణాకు ఇబ్బంది లేకుండా పడవలను సిద్ధం చేశామన్నారు. వరద ప్రభావమున్న గ్రామాల్లో రెవెన్యూ, ఫిషరీస్, పోలీస్, పంచాయతీరాజ్ అధికారులను నియమించామన్నారు. వీరికి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆపదమిత్రులు సహాయంగా పనిచేస్తారన్నారు. ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దని సూచించారు. ఆమె వెంట ఎంపీపీ రావూరి వెంకటరమణ, కనకాయలంక, పెదలంక సర్పంచ్‌లు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు, మండల ప్రత్యేక అధికారి బి.రమణ, తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, ఏఈలు వర్దనపు శ్యాంబాబు, మల్రిపూడి సురేష్‌బాబు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మళ్ల సోని ఉన్నారు.

ఆప్యాయత పంచిన వ్యక్తి సర్రాజు

టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డి



సర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డి, మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం(ప్రకాశం చౌక్): క్షత్రియ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాతపాటి సర్రాజు ఆప్యాయతను పంచిన మంచి మనసున్న వ్యక్తిగా తనకెంతో ఇష్టమని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అలాంటి వ్యక్తి దూరం కావడం బాధాకరమన్నారు. శనివారం భీమవరంలోని సర్రాజు నివాసానికి వచ్చిన ఆయన సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్రాజు కుమారుడు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు), కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ పాలనలో ఎమ్మెల్యేగా పనిచేస్తున్న సమయం నుంచి పాతపాటి సర్రాజుతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ముక్కుసూటిగా మాట్లాడటం, ఆప్యాయతతో ప్రేమగా పలకరించే నైజం ఆయన సొంతమన్నారు. పార్టీకి అలాంటి గొప్ప నాయకుడు దూరం కావడం తీరని లోటన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామన్నారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగేంద్రబాబు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, గోకరాజు రామం, ఏఎస్ రాజు, గాదిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్ల 'పోలవరం' సందర్శన



పోలవరం ప్రాజెక్టు వ్యూపాయింట్ నుంచి పనులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్లు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను ట్రైనీ కలెక్టర్లు శనివారం పరిశీలించారు. 10 మంది ట్రైనీ కలెక్టర్లు శిక్షణలో భాగంగా పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ప్రాంతాల పరిశీలన నిమిత్తం వచ్చినట్లు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. ప్రాజెక్టు పనులను వీరు పరిశీలించి పనుల తీరు, వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో పోలవరం పనుల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంజనీరింగ్ అధికారులు వీరికి వివరించారు. పోలవరం పనులతో పాటు పట్టిసీమ ఎత్తిపోతల పథకం, డెలివరీ పాయింట్ ప్రాంతాన్ని ట్రైనీ కలెక్టర్లు పరిశీలించారు.

విద్యార్థులకు లక్ష్యం తప్పనిసరి



చించినాడ హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

యలమంచిలి: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ముందుకు సాగాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. చించినాడ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఆమె విద్యార్థులకు రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులతో ముచ్చటించారు. వారు జీవితంలో ఏమవ్వాలని అనుకుంటున్నారని ఆరా తీశారు. పలువురు విద్యార్థులు కలెక్టర్ కావాలనుకుంటున్నాం అని చెప్పగా.. అలుపెరుగని కృషి, అకుంఠిత దీక్ష, పట్టుదల ఉండాలని కలెక్టర్ సూచించారు. సర్పంచ్ దంగేటి రాజమణి, ఉప సర్పంచ్ రుద్రరాజు చిన్న, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ రేపూరి శ్రీనివాస్, డీఈఓ వెంకటరమణ, తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామస్తులంతా సోదర భావంతో మెలగాలి

రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న రాజ్యసభ సభ్యుడు బోస్, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాజకీయాలు మాని భేదాభిప్రాయాలకు స్వస్తి పలికి సోదర భావంతో మెలిగిన నాడు గ్రామాలు అభివృద్ధి పథంలో సాగుతాయని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం మండలంలోని నడిపూడి, తామరాడ గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థులకు సెమిస్టర్ పుస్తకాలు అందజేశారు. అందరినీ సమానంగా చూసి, సొంత ఖర్చులతో సైతం ఆదుకొనే వ్యక్తి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అని కొనియాడారు. గుంటూరులో కోట్లాది రూపాయలతో రోగులకు భోజన వసతి కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పేదలకు అండగా నిలిచే శ్రీరంగనాథరాజుకు మద్దతు పలికి, తద్వారా సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల ఏర్పడిన సమస్య పెద్దది కాకుండా చేశామన్నారు. అయితే, మాజీ నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. గరగపర్రులో ఇదే పరిస్థితి నెలకొంటే ఏడాది పాటు అందరూ ఇబ్బందులు పడ్డారన్నారు. అటువంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా కాపాడగలిగామన్నారు. దీనిని మాజీ మంత్రి పితాని వక్రీకరిస్తున్నారని విమర్శించారు. గ్రామంలో ప్రజల మధ్య సోదరభావం పెంపొందింపజేసి శాంతిని కాపాడతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన, పార్టీ రాష్ట్ర నాయకుడు గుడాల గోపీ, సర్పంచ్‌లు కడలి బేబీ అన్నపూర్ణ, మాకినీడి కోట సత్యనారాయణ, వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను, సొసైటీ అధ్యక్షుడు కేశవరపు గణపతి, ఉప సర్పంచ్ పూరిళ్ల శ్రీను, సొసైటీ డైరెక్టరు కుసుమే రాంబాబు, పార్టీ నాయకులు దంపనబోయిన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: పెంటపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య

అత్తిలి: కొమ్మరలో ఐటీఐ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సిర్రా ప్రతాప్ కుమారుడు కార్తీక్ (19) అత్తిలిలో ఐటీఐ చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రించడానికి గదిలోకి వెళ్లాడు. రాత్రి 10 గంటల సమయంలో ప్రతాప్ బంధువు సుధాకరరావు ప్రతాప్ ఇంటికి వచ్చి తన కుమారుడి వాట్సాప్‌లో బైబై అని పెట్టాడని తెలిపి కార్తీక్ గది తలుపును తట్టాడు. తలుపు తెరకపోవడంతో బద్ధలుకొట్టి లోనికి వెళ్లి చూడగా, కార్తీక్ చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. అప్పటికే కార్తీక్ మృతి చెందినట్లు గుర్తించారు. ఎస్సై వి.రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భీమవరంలో చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

సాక్షి, భీమవరం: చదరంగం ఆడడం ద్వారా మేధాశక్తి పెంపొందడమే కాక ఉన్నత విద్యలో రాణించే అవకాశాలు ఉంటాయని భీమవరం ఆర్డీవో దాసి రాజు అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం భీమవరం ప్యాడి రైస్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఏపీ స్టేట్ ఫిడే ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. భీమవరం ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా అనేక చెస్ టోర్నమెంట్లు నిర్వహించడమే కాక ఎంతో మంది చదరంగం క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న జిల్లా చదరంగం అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ నిర్వాహకులను రాజు అభినందించారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది క్రీడాకారులు టోర్నమెంట్‌లో పాల్గొన్నారన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు 23వ తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. యునో ఫీడ్స్ అధినేత తటవర్తి నవీన్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళి రంగ ప్రసాద్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చవాకుల నర్సింహారావు, ప్యాడి రైస్ మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి పర్చూరి నాగేశ్వరరావు, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి గమిని రవి పవన్ కుమార్, టౌన్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో ఇద్దరి అరెస్టు

అన్న, మరో వ్యక్తిపై పోక్సో కేసు నమోదు



ఖాదర్ ఖాన్, అన్న అబ్రహాం

కైకలూరు/మండవల్లి: సభ్య సమాజం తలదించుకునేలా పదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వరుసకు అన్న అయిన యువకుడితో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాస్, సీఐ వైవీవీఎల్ నాయుడు చెప్పారు. మండవల్లి పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. కలిదిండి మండలం మట్టగుంట గ్రామానికి ఓ బాలిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఉంటూ మండవల్లి స్కూల్‌లో ఐదో తరగతి చదువుతోంది. హాస్టల్ సమీపంలో తల్లి అక్క, కుమారుడు అబ్రహం (20)తో నివాసముంటోంది. దీంతో కుమార్తెను అక్క ఇంటికి తల్లి అప్పుడప్పుడూ తీసుకువస్తోంది. ఈ క్రమంలో అన్న వరసైన అబ్రహం బాలికపై కన్నేశాడు. తల్లి లేని సమయంలో బాలికను హాస్టల్ నుంచి తీసుకువచ్చి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ నెల 16న అంతేకాక తనకు పరిచయమున్న పఠాన్ ఖాదర్ ఖాన్ (50)తో కలిసి సామూహిక లైంగికదాడికి దిగాడు. శుక్రవారం మరోసారి హాస్టల్ నుంచి తీసుకురావడానికి ప్రయత్నించగా, బాలిక ఏడుస్తూ వార్డెన్ నాగమణికి విషయం చెప్పగా ఆమె తల్లిదండ్రులకు సమాచారమిచ్చింది. దీంతో బాలిక తల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. మండవల్లి రైల్వేస్టేషన్ సమీపంలో అబ్రహం, ఖాదర్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ చెప్పారు. ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

మండవల్లి బాలికల వసతిగృహ సంక్షేమాధికారిణి కె.నాగమణిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టరు ప్రసన్న వెంకటేష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముదినేపల్లి కళాశాల బాలికల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసరు కె.అనితకు ఇన్‌చార్జి వార్డెన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

బాలికకు ధైర్యం చెప్పిన ఎస్పీ

ఏలూరు టౌన్ : లైంగిక దాడికి గురైన ఏలూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను జిల్లా ఎస్పీ మేరి ప్రశాంతి శనివారం పరామర్శించారు. బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలికకు ధైర్యం చెప్పి తామంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తల్లి ఫిర్యాదు మేరకు నిందితులపై పోక్సో కేసు, ముగ్గురు నిందితుల్లో ఒకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని, నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

సమరసత సేవా ఫౌండేషన్ శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డివిజన్ కన్వీనర్ పవన్‌కుమార్

తణుకు: సమరసత సేవా ఫౌండేషన్ తణుకు సబ్ డివిజన్ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని మండల, గ్రామ కన్వీనర్ల శిక్షణ తరగతులు శనివారం తణుకులో ప్రారంభమయ్యాయి. జిల్లా మహిళా కన్వీనర్ బోనం వెంకటలక్ష్మి అధ్యక్షతన స్థానిక సాయి మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో భవిష్యత్తులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలు మరింత విస్తృతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సహ కన్వీనర్ తణుకు జానకిబాల, తణుకు సబ్ డివిజన్ కన్వీనర్ గరిమెళ్ల పవన్‌కుమార్, విభాగ్ కన్వీనర్ చింతాలకు గోపాలకృష్ణ, రామకృష్ణ మిషన్ సభ్యులు గిరీశ్వరరావు, నాగదత్త శర్మ, పచ్చిపులుసు సత్యానారాయణ, ద్వారపూడి వాసుదేవవసంతరాయుడు, బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ పుస్తకాల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని తేతలి సత్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ పుస్తకాలను శనివారం డీవైఈవో నిమ్మగడ్డ రవీంద్రభారతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ సెమిస్టర్ పుస్తకాలను అందిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలపై అవగాహన చేసుకుని, విద్యార్థులకు బోధించాలని సూచించా రు. ఎంఈవో వి.హనుమ, ప్రధానోపాధ్యాయుడు మైనం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వల్లూరుపల్లిలో వైఎస్సార్ కంటి వెలుగు

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని రాచర్ల సొసైటీ అధ్యక్షుడు కుంచే సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. వల్లూరుపల్లిలో డాక్టర్ ఎస్వీ రమణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆరోగ్యశిబిరంలో భాగంగా వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దెయ్యం శ్రీనివాసరావు, సర్పంచ్ దంగేటి రామారావు , రాచర్ల మాజీ సర్పంచ్ డోకలు కమలాకర్, గుండుమోగుల చిన్న, గ్రామ కార్యదర్శి రామారావు, రాచర్ల సొసైటీ త్రిసభ్యకమిటీ సభ్యులు మజ్జి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

తాడేపల్లిగూడెం అర్బన్: హెచ్ఐవీపై అవగాహనతో ఉండాలని, ఆరోగ్యవంతంగా జీవనం సాగించాలని ఐసీటీసీ కౌన్సిలర్ యార్లగడ్డ బాబూరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ, డీఎస్ఆర్ విభాగాల ఆధ్వర్యంలో స్థానిక ఓర్చిరోడ్డులో నివాసం ఉంటున్న ట్రాన్స్‌జెండర్లకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనారోగ్యానికి గురైన సమయంలో హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఆర్‌సీ కౌన్సిలర్ నూర్, గుడ్‌ల్యాంప్ పీఎం సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెంటపాడు: వృద్ధులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు ధరి చేరవని డీఎంఅండ్‌హెచ్‌వో ఉమామహేశ్వర రావు అన్నారు. చిన్నారుల్లో దృష్టి దోషాలు లేకుండా వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని అన్ని పీహెచ్‌సీలు విజయవంతం చేయాలని ఉమామహేశ్వరరావు తెలిపారు. పెంటపాడు మండలంలోని కోరిమిల్లి గ్రామంలో జరుగుతున్న వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీంతో పాటు డ్రైడే, ఫ్రైడే తదితర ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇరగవరం: మండలంలోని రేలంగి, ఇరగవరం పీహెచ్‌సీల పరిధిలో గోటేరు, తూర్పువిప్పర్రు గ్రామాల్లో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోటేరులో సుమారు 80 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని రేలంగి పీహెచ్‌సీ వైద్యులు బంగారు రవి తెలిపారు. బీపీ, షుగర్ వ్యాధులుకి వ్యాయమం చేయాలన్నారు. తూర్పు విప్పర్రులో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ పర్యవేక్షణలో చైల్డ్ ఫండ్ సంస్థ అధ్వర్యంలో గర్భిణీలకు యువతి, యువకులకు హెచ్ఐ నిర్ధరాణ పరీక్షలు చేయడం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు జుత్తిగ కిషోర్, సాయి, ఎంఎల్‌హెచ్‌పి రబీకా, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

పెంటపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) జీవీకే మల్లికార్జునరావు, రాచర్ల సొసైటీ అధ్యక్షుడు కుంచే సుబ్రహ్మణ్యంలు కోరారు. జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో భాగంగా శనివారం పెంటపాడు మండలం వల్లూరుపల్లి, పెంటపాడు-2 గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులతో అయన మాట్లాడారు. ధ్రువపత్రాలు అందించారు. కాగా సర్వేను సమర్ధవంతంగా నిర్వహించి ప్రతీవారు ప్రభుత్వ పథకంలో లబ్ధిపొందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. ధ్రువపత్రాలు అందించడంలో వలంటీర్లు పడిన కష్టానికి సక్రమంగా రిపోర్టు సమర్పించాలన్నారు. మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు కూడా ఆధార్ ఎన్‌రోల్ అవ్వలేదు. వీటిపై అంగన్‌వాడీ వర్కర్లు తప్పనిసరిగా చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలని డీపీవో పేర్కొన్నారు. దీంతో పాటు, జనన ధ్రువపత్రాలను ఖచ్చితంగా ఇచ్చేలా చూసుకోవాలని, అంగన్‌వాడీ వర్కర్లు తప్పనిసరిగా ఇది బాధ్యతగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ నాయకులు గుండుమోగుల చిన్న, వసంతాడ జోగేంద్ర, రాచర్ల మాజీ సర్పంచ్ డోకుల కమలాకర్, సొసైటీ మాజీ అధ్యక్షులు మజ్జి సుబ్బారావు, సర్పంచ్ దంగేటి రామస్వామి, కార్యదర్శి రామారావు, ఈవోపీఆర్డీ ప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో:

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం పెంటపాడు-2 సచివాలయం వద్ద ప్రజలకు అధికారులు ధ్రువపత్రాలు అందించారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 939 మందికి పలు రకాల ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ఉచిత పౌరసేవలు

అత్తిలి: సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే చేర్చుతున్న వలంటీర్ వ్యవస్థ ప్రతిపక్షపార్టీలకు ఇష్టంలేకనే వారిపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ అన్నారు. శనివారం అత్తిలి మండలం పాలూరు, గుమ్మంపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తానుకొండ దయామణి, వేగేశ్న ధనసత్యనారాయణరాజు, ఉపసర్పంచ్ రాపేటి సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు శరకడం రామలింగ విష్ణుమూర్తి, అద్దంకి శ్రీను, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, మద్దాల శ్రీనివాస్, కంకటాల సతీష్, మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

ఇరగవరం: ప్రజల సంతృప్తి చెందే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగుతుందని సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం తెలిపారు. శనివారం ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే 11 రకాల సర్టిఫికెట్లు మీ ఇంటికే వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, నాయకులు వచ్చి మీకు టోకెన్లు ఇచ్చి మీరు ఎన్నాళ్ల నుండో పెండింగ్‌లో ఉన్నా సర్టిఫికెట్లు ప్రజలకు అందించే కార్యక్రమం చేపట్టారు. సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు అండగా నిలవాలని కోరారు. రేలంగిలో 2301 ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పులుపు అనిల్, పులుపు సునీల్, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఎంపీటీసీలు కిరణ్మయి, మెంటరాజు, నాయకులు చేబ్రోలు పెద్దిరాజు, వడ్డే మార్కేండేయులు ,మైనం పాము, అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు: వల్లూరుపల్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం



అత్తిలి: పాలూరులో జగనన్న సురక్ష సభలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు



తాడేపల్లిగూడెం రూరల్: మోదుగ గుంట సచివాలయం వద్ద ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో విశ్వనాథ్



తణుకుటౌన్: పైడిపర్రులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

జగనన్న సురక్ష ద్వారా లబ్దిదారుల వద్దకే సర్టిఫికేట్‌లు

తణుకు టౌన్: ప్రజల సమస్యల పరిష్కారానికి, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన సర్టిఫికేట్‌లను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందజేసే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తణుకు పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ చెప్పారు. శనివారం తణుకు పట్టణంలోని పైడిపర్రు ప్రాంతంలో గల 31, 32, 33, 34 వార్డులలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమ సభలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం శివశంకర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ములగాల శ్రీనివాసు, నాయకులు కే విశ్వేశ్వరరావు, కొత్తపల్లి చరణ్,లతో పాటు మున్సిపల్, వార్డు సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వార్డులలో గుర్తించిన వారికి 11 రకాల సర్టిఫికేట్‌లను పంపిణీ చేశారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికీ లబ్ధి

తాడేపల్లిగూడెం రూరల్: అర్హులైన ప్రతీ ఒక్కరికీ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అన్నారు. శనివారం మండలంలోని మోదుగ గుంట, రామన్నగూడెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోదుగ గుంట గ్రామంలో జరిగిన సభలో మండల ప్రత్యేకాధికారి దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందని వారు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. తద్వారా వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి తిరిగి సమయంలో అర్హత ఉండి వేర్వేరు కారణాలతో పథకాలు అందని వారిని గుర్తించడం జరుగుతుందన్నారు. అలా గుర్తించిన వారికి అవసరమైన ధ్రువపత్రాలను అందజేసి, లబ్ధి చేకూర్చనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందజేసే 11 రకాల ధ్రువపత్రాలకు ఒక్క రూపాయి చెల్లించకుండానే నేరుగా గ్రామంలోనే అధికారులు అందిస్తారన్నారు. కౌలు రైతులకు సైతం సీసీఆర్‌సీ కార్డులను అందించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. మోదుగ గుంటలో 2003 మందికి, రామన్నగూడెంలో 2050 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చింతా వెంకట్రావు, కట్టా సత్యవతి, ఎమ్పీటీసీలు దూలపల్లి సత్తియ్య, మార్లపూడి సుబ్బారావు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, డిప్యూటీ తహసీల్దార్ నందన్‌రావు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు కె.వేణు అరవింద్, కొడవటి రూప లత, నాయకులు కట్టా జానకీరామయ్య, చీకట్ల మల్లేశ్వరరావు, కొమ్ముగూడెం సొసైటీ డైరెక్టర్ కామన చంద్రరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు సంరక్షణగా ఉందని దీనిని విజయవంతంగా నిర్వహించేందుకు వార్డు సెక్రటరీలు, వలంటీర్లు విధులు సక్రమంగా నిర్వహించాలని ప్రత్యేక అధికారిణి దాసరి సావిత్రి తెలిపారు. స్థానిక 25, 28, 30 వార్డుల్లో జగనన్న సురక్షకార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు రాజేష్, లలితారాణి, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, మున్సిపల్ ఎంఈ మురళీకృష్ణ, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, మానికొండ వెంకటేశ్వరరావు, వార్డు ఇన్‌చార్జిలు ములపర్తి ఆర్జునరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ వసంతం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- పెంటపాడులో గడపగడపకూ..



పెంటపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు

పెంటపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు.శనివారం పెంటపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు దోపిడీ పాలనకు చరమగీతం పాడిన ప్రజలు మరలా ఆయన వచ్చేందుకు ఇష్టపడటం లేదన్నారు. ఈ విషయం టీడీపీ గ్రహించాలన్నారు. ప్రతీ వ్యక్తికి జవాబుదారీగా ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన అన్ని వాగ్దానాలు 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. ఇది చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ప్రజల అవసరాలు గుర్తించి వాటిని నెరవేర్చినప్పుడే ప్రజలు సంతోషిస్తారన్న సంగతిని చంద్రబాబు, పవన్‌లు గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు జగనన్న పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహమండలి అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్, అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, దేవాబత్తుల బాబి నాగమణి, మారంపూడి ఏసుదాసు, వెలగల శ్రీనివాసరెడ్డి(బస్సులరెడ్డి), వీర్ల గోవింద్, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఉండ్రాజవరపు గోపి, చదలవాడ శ్రీనివాస్, గెద్దాడ శేఖర్, సొసైటీల అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, మైలవరపు పెదబాబు, దేవ వెంకటరమణ, ఏఎంసీ వైస్ చైర్మన్ జామికృష్ణ, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, రెడ్డి సూరిబాబు, పొట్ల ఏడుకొండలు, సైపురెడ్డి రాంబాబు, ములగాల బాబ్జి, బండారు గోపి, ఏవీఎస్, కేగాల గణపతి, బొమ్మినాయుడు, డోకల రాము, మిరియాల బాస్కరరావు, పార్టీ నాయకులు బోణం వీరయ్య, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, పంచాయతీ రాజ్ ఏఈ నవీన్, పలు శాఖల ఏఈలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రభుత్వంలో దోపిడీరాజ్యం

పెంటపాడు: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రభుత్వంలో దోపిడీ రాజ్యమేలిందని, జన్మభూమికమిటీలు సామాన్యులను దోచుకొంటే, ఇసుక, భూకుంభకోణాలతో రాష్ట్రం అట్టుడికిందని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో కాపురం ఉంటున్న చంద్రబాబు రాష్ట్రంలో అడుగుపెట్టిన ప్రతీసారి రాజకీయాలు కలుషితం అవుతున్నాయన్నారు. కరోనా కష్టకాలంలోనూ, పథకాలు ప్రజలకు అందించడంలోనూ నిస్వార్థంగా సేవలు చేస్తున్న వలంటీర్లపై జనసేన నేత పవన్ వాఖ్యలు అర్ధరహితమని మంత్రి పేర్కొన్నారు. డేటా చోరీ అని చెప్పి లక్షలాదిమంది వాలంటీర్ల ఆగ్రహానికి పవన్‌గురైడన్నారు. ఇటీవల ఎన్డీఏ సమావేశంలో పవన్‌కు అక్షింతలు పడ్డాయన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీపై చేసిన ఆరోపణలకు తక్షణం ఆధారాలు చూపాలన్నారు. జగనన్నకు వస్తున్న ఆధరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు అవాకులు, చవాకులు మాట్లాడటం సరికాదన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఎంపీపీ దాసరి హైమావతి, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, వీర్ల గోవింద్, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు .

అందరికీ విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయం

తాడేపల్లిగూడెం రూరల్: అందరికీ విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఈవో-2 పీఎం కే.జ్యోతి అన్నారు. శనివారం మండలంలోని రామన్నగూడెం, జగ్గన్నపేట గ్రామాల్లో డ్రాప్ అవుట్స్ గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 జ్యోతి మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు ప్రతి ఒక్కరూ విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా ఒకరిని పాఠశాలలోనూ, మరో ఎనిమిది మందిని ఓపెన్ స్కూల్స్‌లో చేర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌లు శ్యామ్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన మండల బృందం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో మధ్యలో బడి మానేసిన ఇద్దరు విద్యార్థులను పాఠశాలలో చేర్పించినట్లు ఎంపీడీవో పీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా వేల్పూరు గ్రామంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను జిల్లా గృహ నిర్మాణ ప్రాజెక్ట్ ఎస్‌టీవీ రాజేశ్వరరావు పరిశీలించి. పలు సూచనలు చేశారు.

వలంటీర్లకు వందనం

తోబుట్టువులా వలంటీర్



తాడేపల్లిగూడెం (టీఓసీ): నా పేరు దూలం ప్రసన్న. నేను స్థానిక పదోవ వార్డులో నేను నివాసం ఉంటున్నాను. మా వార్డు వలంటీర్ మల్లిపూడి వెంకట లక్ష్మి తమకు అనేక సేవలను అందిస్తున్నారు. రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమాలను ఎప్పటికప్పుడు తమ వద్దకు వలంటీర్ చేరవేస్తున్నారు. రైతు భరోసా, అమ్మవడి, డ్వాక్రా రుణాలు, విద్యా దీవెన, ఇంటి స్థలం తదితర సంక్షేమాలు తోబుట్టువులా వచ్చి అందించారు. ప్రజల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమాలను అమలు చేస్తున్నారు. ఆయనకు దన్యవాదాలు

–దూలం ప్రసన్న, గృహిణి, 10వ వార్డు, తాడేపల్లిగూడెం

వలంటీర్ల సేవలు మరువలేనివి



తాడేపల్లిగూడెం (టీఓసీ): నాపేరు వీరభద్రం, నేను పదో వార్డులో నివాసం ఉంటున్నారు. మా వార్డు వలంటీర్ మల్లిపూడి వెంకట లక్ష్మి అందిస్తున్న అనేక సేవలు మరవలేనివి. సీనియర్ సిటిజన్‌గా నాకు పెన్షన్ వస్తుంది. చాలా సంతోషంగా ఉంది. మా కుటుంబంలో ఒకరు కాపు నేస్తం తీసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమాలను ఎప్పటికప్పుడు సమాచారం వలంటీర్ ద్వారా రావడం మంచి నిర్ణయం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఆదర్శప్రాయం. ఆయనకు అభినందనలు

–తణుకు వీరభద్రం, సీనియర్ సిటిజన్ 10వ వార్డు, తాడేపల్లిగూడెం

మణిపూర్‌లో ఘటనలు దారుణం



మణిపూర్‌లో ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను నిలిపివేసే విధంగా కృషి చేయాలని, మానవహక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ నియోజకవర్గ నాయకులు, రైల్వే గూడ్స్ షెడ్డు వర్కర్స్ (సీఐటీయూ) యూనియన్ నాయకులు శనివారం రైల్వే గూడ్స్ షెడ్డు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ గత కొంత కాలంగా కేంద్రంలోని బీజేపీ కాని, మణిపూర్ రాష్ట్రంలోని బీజేపీ కాని అక్కడ జరుగుతున్న మారణకాండను నిలిపివేయడంలో ఘోరంగా విఫలమైందని తెలిపారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ మొసలి కన్నీరు కార్చి, దోషులను శిక్షిస్తామని ప్రకటన చేశారని, ఇది దారుణమని విమర్శించారు. మణిపూర్ సంఘటన విషయంలో కేంద్రం పార్లమెంట్‌లో చర్చకు తావు లేకుండా వాయిదా వేస్తుందని, మణిపూర్‌లోని గిరిజనలను రక్షించాలని కోరారు. ఈ నిరసనలో సత్తి కోదండరామ్ రెడ్డి, సాయి రెడ్డి, సుబ్బిరెడ్డి, ఆంజనేయులు, నారాయణ, కృష్ణ, పుత్రయ్య, కర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు. మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన అగత్యాలకు నిరసనగా ఐద్వా తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐద్వా పట్టణ నాయకురాలు బి.యశోద మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలను ఖండించారు. మహిళలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన

పెంటపాడు: పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు తక్షణం జీతాలు చెల్లించాలని శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఏఐటీయుసీ గౌరవ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ మాట్లాడుతూ జీతాలు ఇవ్వక పోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిక్కాల రాజు, వరలక్ష్మి, లక్ష్మి, సింహాచలం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీబీఆర్‌లో ముగిసిన కార్గిల్ విజయ్‌దివస్ వారోత్సవాలు

పెంటపాడు: గత వారం రోజులు నుంచి అలంపురం టీబీఆర్ సైనిక స్కూల్లో జరుగుతున్న కార్గిల్ విజయ్‌దివస్ వారోత్సవాలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ సైనిక ఉద్యోగుల సంఘ నాయకులు తనుబద్ది భోగేశ్వరరావు ఆధ్వర్యంలో స్కూల్లో చిన్నారులతో పరేడ్ నిర్వహించారు. దేశభక్తిపూరిత కీర్తనలు ఆలపించారు. గ్రామ వీధుల్లో తిరుగుతూ ఎన్‌సీసీ విద్యార్థులు జయజయ నినాదాలు చేశారు. జాతీయ పతాకానికి సెల్యూట్ చేశారు. అమరజవాన్ స్థూపం వద్ద నివాళ్లులర్పించారు. కార్గిల్ యుద్ధ సమయంలో వీరోచితంగా పోరాడిన సైనికుల చరిత్రలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీబీఆర్ సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌లకు రెయిన్ కోట్ల అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): డీఎస్ చెరువు సమీపంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి స్థానిక శాఖ వారి ఆధ్వర్యంలో వర్షకాలంలో బయట విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్‌లకు శనివారం రెయిన్ కోట్‌లు అందజేశారు. పట్టణ సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఇనస్పెక్టర్ సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థ ద్వారా ప్రజలకు అనేక సేవలను అందతున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం పోలీసులకు కూడా సత్యసాయి సంస్థ పలు సేవలు అందిస్తున్నారని, రెయిన్ కోట్‌లు, వాటర్ బాటిల్స్, యూనిఫాం క్లాత్‌లు ఇతర సేవలు అందుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు, సేవా సంస్థ జిల్లా భజన కో-ఆర్డినేటర్ ఆకుల సవీన్ బాబా, ప్రవా శ్రీనివాస్, జంధ్యాల నాగేశ్వరరావు, రుద్ర సాయి బాబా, ఆకుల రాము, విజయసాయి, అనిల్ కుమార్, సతీష్, వంశీ, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.